# అడిగానని చెప్పండి

వంలిస్



రైలు రాలేదు.

దీపాల వెలుగును, ప్లాట్‌ఫారంమీద తిరుగుతున్న అనేకానేక జనాన్ని, మార్చిమార్చి చూస్తూ పచార్లు చేస్తున్నాడు సత్యం. అతనక్కడకొచ్చి గంటయింది. ఆ గంటలోనూ అతను చాలా దృశ్యాలు చూశాడు.

సత్యం మనసులాగాన, ప్లాట్‌ఫారం గందరగోళంగా ఉంది. అర్ధరాత్రి దాటిపోయినా, అమ్మకాలవాళ్ళ కేకలు ఆగలేదు నిద్ర తూగిపోతున్న జనం, ప్లాట్‌ఫారంమీద జోగుతూ, మధ్యమధ్య రైలు కూతలకి ఝుకునుకున్నట్లుగా మేలుకుంటున్నారు. తమదికాని రైలు కనిపించగానే విసుక్కుంటున్నారు.

సత్యం నవ్వుకున్నాడు.

కాని, దాదాపు పావుగంట క్రితంనుంచీ అతని దృష్టి, స్టేషన్ మాష్టర్ గదిగోడ నానుకొని వాదిగి కూచునివున్న నల్లపిల్లమీదవుంది. ఆ అమ్మాయి వాలకం, ఆమె పల్లెటూరిదని చెబుతున్నది. ఆమె పక్కన కూచున్న ఆమె భర్త, ఆ యువతి స్పర్శకు అనుభవిస్తున్న ఆనందాన్ని, అతని కళ్ళల్లోని వెలుగు, ముఖం మీద వెలుగుతున్న కనిపించీ కనిపించని దరహాసరేఖా తెలియజెబుతున్నాయి ఆ యువతి నల్లగా ఉంది. (ఆకాశం నల్లగా ఉండదూ?) ఆ అమ్మాయి కళ్ళు చక్రాల్లా వున్నాయి. (విష్ణుచక్రం అలాగే మెరుస్తుందేమో?) ఆమె శరీరంలో ఆరోగ్యం ఉంది. (ఆమె గడ్డి తినదు గనక!)

సత్యానికి సత్యవతి గుర్తొచ్చింది,

సత్యవతి నల్లపిల్లకాదు. ఎర్రగా, పన్నగా పొడుగ్గా ఉండేది. కళ్ళు నక్షత్రాల్లాగా ఉండేవి. నవ్వితే...ఆ నవ్వును వర్ణించటం అతని తరం కాదు. చిలకలాగా వుండే సత్యవతి చిలకలాగే మాట్లాడేది.

ఆ సత్యవతి, యిప్పుడు మూర్తి భార్య.

సత్యానికి ఆ సత్యం బాధాకరంగా లేదు. మూర్తి అయోగ్యుడూ అప్రయోజకుడూ కాదు. ఆ పైన సత్యవతికి మనసా వచ్చినవాడు. వాళ్ళిద్దరూ పెళ్ళిచేసుకుంటే అందులో కూడని దేమీలేదు. కూడనిదేమన్నా ఉంటే...

సత్యం జేబులోంచి ఉత్తరం తీశాడు.

ఆ ఉత్తరం సత్యవతి రాసింది. కుశల ప్రశ్నలూ, యోగక్షేమలూ అయిన తర్వాత, "ఆయనా, నేనూ రేపు విశాఖపట్నం వెళుతున్నాం. బెజవాడలో దిగటానికి వీలుండదంటున్నారు, స్టేషన్‌కి వస్తావా అన్నయ్యా? నిన్ను చూడాలని. నీతో ఎన్నో మాట్లాడాలని ఉంది. రాకపోతే నామీద ఒట్టే" అని రాసింది.

పిచ్చిమొద్దు!

మనుషుల్ని ఒకళ్ళకోసం ఒకళ్ళు త్యాగం చేసుకుంటారంటే, అది సత్యానికి పిచ్చి వూహలుగా కనిపిస్తుంది త్యాగాలనేవి జీవితంలో ఉండవు, బాధ్యతలు ఉంటాయి. అనుభూతులూ, అభిమానాలూ ఉంటాయి. అందుకే ఆ రోజున—

ఆ రోజున సత్యవతికీ - మూర్తికీ పెళ్ళి నిశ్చయమైంది. ఆ పెళ్ళి అలా నిశ్చయం కాదేమోనన్న బెంగ, నిశ్చయం కావాలన్న ఆతృత సత్యాన్ని చాలా కృంగదీసిన కాలమది. మూర్తి యోగ్యతా యోగ్యతల్లోకూడా నమ్మకం సడలిపోసాగింది. మగవాడు చెప్పే పెద్దకబుర్లు తన విషయంలో పాటించేవి కాదన్న నమ్మకం కూడా ఏర్పడుతున్న రోజులు. సత్యవతి పసిపిల్ల కాదు. పద్దెనిమిది సంవత్సరాల యువతి, ఆ పిల్లకి చాలామంది మగస్నేహితు లున్నారు. వారంతా ఆ పిల్ల యింటికి వస్తారు. అందరు మగస్నేహితులు గల అమ్మాయిని, తన సహచరిగా ఎన్నుకొనే హృదయ వైశాల్యం మూర్తిలో లేకపోవచ్చును.

అలాంటి అనుమానాలన్నీ అతనిలో కలగటానికి మూర్తి అన్న కొన్ని మాటలు కూడా కారణభూతం కాకపోలేదు. అతను నిముషాని కొకరకంగా మాట్లాడాడు. తనకేవో బలహీనతలున్నాయన్నాడు. తను సత్యవతిని సుఖపెట్టలేనన్నాడు. ఇవన్నీ అతను ఎందుకంటున్నాడో ఎరిగిన సత్యం, తన ఊహని బైటపెట్టేసరికి, అతను ముఖం కందగడ్డలాగా చేసుకుని "ఇంకెప్పుడూ అలాంటి మాటలనకండి మాష్టారూ! మీ యిద్దర్నీ అనుమానించిన

మనిషికి పుట్టగతు లుండవు" అన్నాడు. ఆ మర్నాడే అతను పెళ్ళికి వొప్పుతున్నాడు.

ఆ ఉదయం, సత్యవతి సిగ్గుపడుతూ, ఈ సంగతి చెప్పినప్పుడు సత్యం గుండెల్లో ఏదో జీర కదులాడింది. ఒక్క కడుపున మాత్రమేకాక, ఒక్క కులంలోనైనా పుట్టని తనూ, సత్యవతీ ఆప్యాయంగా, సన్నిహితంగా చూసుకున్న తన సత్యవతి ఈనాటినుంచీ మరొకరి సొత్తుఅయి తనకి దూరమవుతున్నది. ఇకపైన ఇదివరకటి చనువూ, సాన్నిహిత్యమూ ఉండదు. ఉండాలని ఆశించటం అవివేకము, అత్యాశా అవుతుంది. తన పెళ్ళికబురు చెప్పినక్షణాన ఆ పిల్ల ముఖంలో కనిపించిన ఆనందానుభూతి, అతనిలో అప్యాయతను మరింత పెంచింది. ఒక్కక్షణం ఊరుకుని "పరాయి దానివయి పోయావు" అన్నాడు.

సత్యవతి తలఎత్తి "మనస్ఫూర్తిగా ఆ మాట అంటున్నావా?" అన్నది.

"ఎందుకు కాదు?"

"నువ్విక-నాకు దూరమౌతావా?"

సత్యానికి నవ్వొచ్చింది. "నాకన్నా దగ్గిర వాళ్ళు, దగ్గిరగా ఉండగల హక్కుగలవాళ్ళు నీకు దొరికారు, కాదంటావా?" అన్నాడు.

"అది నీ పొరపాటు."

ఆ మాట నిజం కావడానికి వీల్లేదని సత్యం నమ్మాడు. మూర్తి ఎంతటి విశాల హృదయుడైనా తనకీ సత్యవతికీ ఉన్న స్నేహాన్ని అపార్థం చేసుకోని వాడే అయినా, అతను ఉప్పూ కారం తినే మనిషి. ఇది వరకు లాగా, ఆ పిల్ల తన వొళ్ళో తలపెట్టి మాట్లాడితే సహించగల ఓర్పు అతనిలో ఉండదు. ఇది వరకు లాగా తాను ఆ పిల్ల భుజంమీద చేయి వేస్తే హర్షించగల శక్తి అతనికి ఉండదు. ఈ రెండూ జరగని స్నేహాన్ని తను ఊహించనూ లేదు. భరించనూ లేదు. అంత్య నిష్ఠూరం కన్నా ఆదినిష్ఠూరం మేలు.

సత్యవతి యిదంతా అర్థం చేసుకుంది. "ఆయన మనల్ని విడదీయరన్నయ్యా" అన్నది.

తాను చెబుతావా?" అన్నాడు.

"అడుగు"

"నా సంతోషం కోసం జవాబివ్వాలి... ఒకవేళ అతను, నాతో మాట్లాడొద్దని నిన్ను శాసిస్తే ఏం చేస్తావు? మానేస్తావా?"

సత్యవతి పకపక నవ్వి "మానేస్తాను" అన్నది.

సత్యం ఆ మాటకి చాలా ఆనందించాడు. "థాంక్స్!" అన్నాడు.

ఒక్కక్షణంఆగి, "పెళ్ళిచేసుకో అన్నయ్యా" అన్నది సత్యవతి.

"ఎవర్ని?" అన్నాడు సత్యం.

"ఒక అందమైన అమ్మాయిని"

"ఎలా వుంటుంది? నీ అంత అందంగా ఉంటుందా?"

"నీ కన్నీ వేళాకోళమే" మూతి ముడుచుకుంది సత్యవతి.

సత్యం నవ్వాడు.

సత్యవతి తలవొంచుకుని "సాధ్యమైనంత తొందరగా పెళ్ళిచేసుకో అన్నాయి! వొదిన వొచ్చాక..." అని ఏదో అనబోయి గాద్గదికత అడ్డురాగా ఆగిపోయింది.

సత్యం లేచి ఆమె భుజం తట్టబోయి ఆగిపోయాడు.

"లేచావేం?" అన్నది సత్యవతి.

"వెళ్ళొస్తాను"

సత్యవతి తల వూపింది.

"గుమ్మందాకా నన్నా రావా?"

సత్యవతి నవ్వి "పద" అన్నది.

వీధిగుమ్మందాటి తర్వాత, సైకిలు ఎక్కబోతూ "పిల్లనిచూడు! పెళ్ళిచేసుకుంటాను. కాని, నన్ను మర్చిపోకేం" అన్నాడు.

సత్యవతి చిన్నగా నవ్వింది.

"వస్తాను"

సత్యవతి తలవూపింది.

ఇంటికి వస్తూంటే, ఎన్నో ఆలోచనలు అతన్ని ముసురుకున్నాయి. అతనికి నవ్వొచ్చింది. తను యింటికివొస్తే అన్నయ్యొచ్చాడు అని గాబరాపడి, పసిపిల్లలాగా గంతులువేసే సత్యవతి, తాను వెళ్తానంటే

సత్యం నవ్వి "ఏమిటా గ్యారంటీ ?" అన్నాడు.

"అలాగని ప్రామిస్ చేశారు."


ఆ మాట ఎందుకో సత్యానికి నచ్చలేదు. ఆ మాట దాచుకుని "పోనీ ఒక మాట అడుగు వద్దుకూచోమని బలవంతపెట్టే సత్యవతి, ఈనాడు గుమ్మందాకావొచ్చి సాగనంపటానికి కూడా వెనుకాడింది. అందులో అసహజం ఏముంది ? కాని, ఇన్నిసంవత్సరాల స్నేహం, శరీరాలు వేరయినా, మనసులొక్కటి అనుకున్న స్నేహం, తెగిపోతున్నదన్న నిజం అతని గుండెల్ని రంపంతో కోస్తున్నది !

సత్యానికి, ఆ క్షణాన, అప్పటికి నాలుగైదు సంవత్సరాలక్రితం జరిగిన సంగతి గుర్తొచ్చింది. స్వంతానికి అక్కయ్యలు లేని సత్యానికి, పెదనాన్న కూతురు హేమ స్వంత అక్కయ్యకన్నా ఎక్కువగా ఉండేది. బి. ఎ పరీక్షలో యూనివర్శిటీ కంతటికీ ఫస్టుగా ప్యాసయిన, బంగారపు మెడల్ పుచ్చుకున్న ఆరునెలలపాటు, అతనితోపాటుగా అతనియింట్లోనే వుంది. ప్రతి అల్ప విషయానికి బుర్ర పాడు చేసుకుని, దిగాలుగా కూచునే సత్యం, ఆమె వొళ్లో తల దాచుకుని ఉపశమనం పొందేవాడు. ఈ ఆరు నెలల కాలంలోనే, ఆమె తండ్రి ఆమెకి సలక్షణమైన సంబంధం చూశాడు. తన డాబుకి తగ్గ విధంగా పెళ్లిచేశాడు. పెళ్లి నాడు, ముఖాన కళ్యాణం బొట్టుపెట్టుకుని, పట్టుచీరె కట్టుకుని, అక్కాయి తన దగ్గరకివస్తే, ఆమెనికౌగలించుకుని, రాబోయిన కన్నీళ్ళని బలవంతాన ఆపుకున్నాడు సత్యం.

ఆ మరుసటిరోజు, హేమ భర్తతో కలిసి అత్తవారింటికి వెళ్లిపోయింది. ఆ రోజంతా సత్యానికి అక్కయ్య రూపమే కళ్ళల్లో కనిపించింది. కాలేజీలో కూచుని "అక్కయ్య" అని తాటికాయలంత లేసిఅక్షరాలు పుస్తకంలో చెక్కుతూ కూచున్నాడు. అతని పరధ్యానాన్ని గమనించి వెళతావా ?" అన్నాడు. సత్యం వెర్రిమొహం వేశాడు. ఇంటికెందుకు ? అక్కడే అక్కయ్య ఉందా ? వెర్రివాడు !

ఈనాడు అదే తీరుగా సత్యవతికూడా దూరమవుతున్నది. మూర్తితో నేస్తం కట్టి జీవిత మాధుర్యానికి సరిహద్దులను చవిచూచే మనోహర క్షణాలలో, యుగాలలో ఆ పిల్లకు తాను గుర్తురాడు. రారాదు. కాని, తనకు గుర్తు రాకుండా ఉండదు మరి ఎలా...

ఆ తర్వాత అయిదారు నెలలకి మూర్తిని



పెళ్ళిచేసుకొని, అతనితో పరోవూరు వెళ్ళిపోయింది సత్యవతి. దాదాపు పరో అయిదారు నెలల తర్వాత ఉత్తరం రాసింది "పెళ్ళి చేసుకున్నావని విన్నాను. శుభలేఖ అందుకోడానికైనా నోచుకోలేదా అన్నయ్యా?... ఆయన నన్ను అడిగానని చెప్పమన్నారు" అని ఆ ఉత్తరంలో నాలుగేవాక్యాలున్నాయి. తాను పెళ్ళి చేసుకోలేదని, చేసుకోవాలన్న కోరిక చచ్చిపోయిందని ఆ పిల్లకి రాయాలనుకున్నాడు. పెళ్ళికూడా జీవితానికి ఒక అవసరం. కాని, ఎందరెందర్నితనతో గూడుకట్టుకోవటానికివొచ్చేపిల్ల, దూరం చేసుకుని, ఎన్ని అసభూతుల శిథిలాల తాకిడికి వొరిగి, తన దగ్గిరకి భార్యగా వొస్తుందో ఊహించినప్పుడు తన గుండె చెరువవుతున్నది.

ఇదేమాట తన మేనమామకొడుకుతో అంటే, అతను నవ్వేశాడు. పెళ్ళిని గురించి, గార్హస్థ్య జీవితాన్ని గురించి అతనికి చాలా గట్టి అభిప్రాయాలున్నాయి వేదాంతతత్వం దగ్గిర్నుంచి, శారీరక అవసరాలదాకా అతను చాలా కారణాలను ఏకరువుపెట్టాడు. సత్యానికి అదేమీ బుర్రకెక్కలేదు. జీవితాన్ని వొదిలి సాముచేసేవేదాంతం తనకక్కర్లేదు. మనిషిలోనే దేముడున్నాడని మనసారా నమ్మినతాను "విధి" నిర్వహణ పేరుతో, ఆత్మవంచనకి పాల్పడలేదు. అదే అతనితో చెబుతూ "నీఖర్మ" అనేసి వెళ్ళిపోయాడతను.

కొంతకాలం గడిచేసరికి, సత్యవతి దగ్గిర్నుంచి ఉత్తరాలు కూడా ఆగిపోయాయి. అందుకు కారణం బోధపడక ఆ పిల్లను చూడాలన్న బలమైన కోరికను అణుచుకోలేక, ఆఫీసుకు సెలవపెట్టి బయలుదేరాడు. బస్‌స్టాండుకొచ్చేసరికి, పనసపండులాంటి కొడుకును ఎత్తుకుని నిలబడివున్న చిన్ననాటి స్నేహితురాలు ఇందిర కనిపించింది. సత్యాన్ని చూడంగానే చేటంత ముఖం చేసుకుని పలకరించింది" బావున్నారా?" అంటూ.

సత్యం తలవూపి "మీ అబ్బాయా!" అన్నాడు.

ఇందిర తలవూపి "కులదీపకుడు" అన్నది.

కుర్రవెధవ సత్యాన్ని చూసి ఎగిరెగిరి పడటంతో, వాడ్ని అందుకున్నాడతను. ఇందిర నవ్వుతూ "మామయ్యని అప్పుడే మచ్చిక చేసుకుంటున్నాడు" అన్నది. "పేరా?" అన్నాడు సత్యం.

పిల్లవాడు కిలకిల నవ్వాడు.

అటూ యిటూ చూసి "మీ ఆయనేడమ్మా?" అన్నాడు సత్యం.

"ఆయన స్నేహితులెవరో కనిపిస్తే అలా వెళ్లారు...ఎక్కడకో ప్రయాణమైనట్లున్నారే?" అన్నది ఇందిర.

సత్యం చెప్పాడు.

"సత్యవతిని చూడటానికేనా?"

"ఊఁ"

"దాని కూతురు బంగారపుబొమ్మలావుంది... అచ్చు దాని పోలికే"

సత్యం తెల్లబోయి "దానికి కూతురు పుట్టిందా?" అన్నాడు.

ఇందిర ఆశ్చర్యంగా "అదేమిటి! ఆరు నెల్లయింది. మీకు తెలీదా?" అన్నది.

"ఊహూఁ" అన్నాడతను నీరసంగా.

"బలేవాడేనే!"

అర్థంకాక "ఎవరు?" అన్నాడు సత్యం.

"ఆ మూర్తిగారేనండీ! మీకు ఉత్తరం రాశానని, మీరు జవాబు రాయలేదని చెప్పాడు. నిజమే ననుకున్నాను."

అంతే! ఆ తర్వాత సత్యం ఇందిరని ఏమీ అడగలేదు. సంచితీసుకొని యింటి ముఖం పట్టాడు. మొత్తంమీద మూర్తి తాను అనుకున్నంత పనీ చేశాడన్నమాట! సత్యవతికి కూతురు పుట్టింది. దానికి తల్లి పోలికలే వచ్చాయన్నమాట? తనను పెళ్ళిచేసుకోమని తొందర పెట్టిన రోజుల్లో ఒకనాడు "నీ కూతుర్ని చేసుకుంటానులే" అన్నాడతను సత్యవతితో. "చాలా తొందర్లో మాట" అన్నది సత్యవతి.

కాపరానికి వెళ్ళిపోయేదానికి ముందురోజున, సత్యవతి తనతో చెప్పటానికి వొచ్చింది. ముఖాన పసుపుఛాయలు, కళ్ళకి కాటుక, పాదాలకు పారాణి, దివినించి దిగివచ్చిన దేవతలావున్న ఆ పిల్లను చూడంగానే సత్యానికి

కళ్ళు చిగుర్చాయి. శారీరకమైన ఆ సౌందర్యం వెనుకనున్న మనసు కొన్ని నెలల క్రిందటిదాకా తన స్వంతం. నేటినుంచీ...

"వెళ్ళిపోతున్నావా ?" అన్నాడు.

"ఊఁ"

"గుర్తుంటానా ?"

"బతికున్నంతకాలం మర్చిపోను."

"అంత ప్రామిస్ వొద్దులే...ఒక కోరిక తీరుస్తావా ?"

"అడుగు"

"నీ మాట ప్రకారం పెళ్ళి చేసుకుంటాను. నాకు కూతురు పుడితే దాన్ని నీ కొడుక్కి చేసుకుంటావా ?"

సత్యవతి కంట నీరు తిరిగింది. "అంత అదృష్టమా ?" అన్నది.

"అదృష్టం ప్రసక్తేముంది ? అది నా కోరిక"

సత్యవతి నవ్వి "మరి నాకే కూతురు పుడితే ?" అన్నది.

"నా కొడుక్కి చేసుకుంటాను."

"ప్రామిస్"

"ప్రామిస్"

"కట్నం అడగవుగా ?"

"అడుగుతాను"

"నేను పేదదాన్నిగా అన్నా ! "ఇచ్చుకో లేను"

"ఇవ్వ గలిగిందే అడుగుతాను"


"ఏమిటి ?"

"చిన్నప్పటిలాగా, నువ్వు నా ఒళ్ళో తల దాచుకోవాలని, ఆనాటి ఆప్యాయతతో నా చెవులు మెలెయ్యాలని ఈ కట్నం యిస్తావా ?"

సత్యవతి ఒక క్షణం తటపటాయించి "నాకన్నా వయసులోనూ, అనుభవంలోనూ పెద్దవాడివి. నేనాకోరిక తీర్చగలననే కోరావా ?" అన్నది.

సత్యం నోట మాట రాలేదు.

ఆ విధంగా అతను, సత్యవతీ విడిపోయారు. సంవత్సరాలు గడిచిపోయినా సత్యానికి ఆమెను చూడాలన్న కోరిక మరింత బలవత్తర మౌతూ వచ్చిందితప్ప తగ్గిపోలేదు తోడబుట్టిన అన్నచెల్లెళ్లయితే, వాళ్ళని చూడలేక పోవటమన్న దుర్దశ సంప్రాప్తించదు. మూర్తి మంచితనంలో, గొప్పతనంలో నమ్మకం సడలిపోకపోయినా, జీవితాన్నిపట్టి చల్లార్చే పట్టుదారాలు, దేవత వస్త్రాలలాగా అదృశ్యంగా ఉంటే



అనేకానేక పిచత్వాలు అతనిది. సత్యవతి యింటికి పోకుండా ఆపుచేశాయి. ఎక్కడైనా ఒక అందమైన ఆడపిల్ల, యువకుడూ బుజం బుజం రాసుకుంటూ, నిష్కల్మషంగా నవ్వుకుంటూ కనిపిస్తే, ఆ ఆడపిల్ల సత్యవతే నేమోనని విభ్రాంతి కూడా కలిగేది. జీవితంలోని వసంతకాలానికి, యిలాంటి ఆలోచనల్తో వ్యర్థం చేసుకుంటున్న కొడుకుని చూసి, కడుపులోన దుఃఖపడేది అతని తల్లి వర్ధనమ్మ.

తనని చూడాలని వున్నదని సత్యవతి దగ్గరనుంచి ఉత్తరం వచ్చిన రోజున, సత్యం ఆనందానికి అవధులు లేవు. ఇదిరతో ఉత్తరం రాశానన్న మూర్తి. నిజంగానే ఉత్తరం రాశాడేమో? అది తనకి అంది వుండదు సత్యవతి తనని మర్చిపోతుందా? సత్యానికి నవ్వాలనిపించింది. "నీతో కాపురం ప్రారంభించాక, నా చెల్లెలికి నేను గుర్తుంటానా?" అని మూర్తితో ఒకసారి అంటే అతను నవ్వేశాడు. "మిమ్మల్ని అదీ, దాన్నిమీరు మర్చిపోవటం జరిగేదేనంటారా మాష్టారూ? ఎందుకలా అబద్ధాలాడతారు?" అన్నాడు. అందులో ఎంత యదార్థం ఉందో ఈనాటి ఉత్తరం రుజువు చేస్తున్నది!

అర్ధరాత్రి అవుతోండగా స్టేషన్‌కు బయలుదేరిన కొడుకు దగ్గిరకివచ్చి "అతన్తో నేను చెప్పానని చెప్పు. వాళ్ళని మనింటికి తీసుకురా. దాన్ని చూడాలని మనసు కొట్టుకుపోతున్నది" అన్నది వర్ధనమ్మ. సత్యం తలవూపి హుషారుగా స్టేషన్‌కు వచ్చాడు...

దగ్గర్లో లౌడ్ స్పీకర్ ఖయ్యిమంది!

సత్యం హడావుడిగా లేచాడు రొప్పుకొంటూ రొజుకుంటూ పూరీ ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫారం మీదికి వొచ్చేసింది. జనాన్ని తోసుకుంటూ, కంగారుని అణుచుకుంటూ ముందుకు నడిచాడతను. రెండు మూడు కంపార్ట్‌మెంట్లు దాటేసరికి, ఎవరో బుజం మీద బలంగా చెయ్యి వెయ్యటంతో ఆగిపోయాడు.

మూర్తి!

సత్యాన్ని చూసి పకపక నవ్వుతూ "ఆడపడుచుమీద ఎంత ప్రేమవున్నా, అంత పరధ్యానంకూడదయ్యా!...పద! కాస్త కాఫీ సేవించుదాం" అన్నాడు. సత్యం బిక్కమొహం వేసి "దాన్ని.....దాన్నికూడా పిలుద్దాం" అన్నాడు. మూర్తి నవ్వాపకుండా "ముందు పోదాంపద! మళ్ళీ టైమవుతుంది" అని జబ్బ పుచ్చుకున్నాడు.

సత్యవతిని చూడాలన్నకోరిక శాఖోపశాఖలుగా మనసులో విస్తరించివున్నా, అతని మాట కాదనలేక కాంటీన్‌వైపు నడిచాడు సత్యం. కాఫీ తెచ్చుకుని వో మూలబల్లమీద కూచున్నాక "ఏమిటి విశేషాలు? పెళ్ళి చేసుకున్నారా?" అన్నాడు మూర్తి.

సత్యానికి కాస్త మండింది "మీకు తెలియదా?" అన్నాడు.

"ఎలా తెలుస్తుంది స్వామీ? మా ఉత్తరాలకి మీరు జవాబు యివ్వరాయె."

"సారీ మీ ఉత్తరాలు నాకు అందలేదు" అన్నాడు సత్యం.

"బాధపడకండి. నవ్వులాటకి అన్నాను... ఇంతకీ పెళ్ళెందుకు చేసుకోలేదు? తగిన పిల్ల దొరకకనా?"

"అలాగే అనుకోండి"

మూర్తి ఒక్కక్షణం మౌనంగా ఉండి- "నేను చాలా అదృష్టవంతుడ్ని సత్యంగారూ! సత్యవతివంటి భార్య దొరకటం నిజంగా నా అదృష్టం" అన్నాడు నెమ్మదిగా.

సత్యం హృదయం ఆర్ద్రమైంది.

"పెళ్ళికిముందు దాని చిలిపితనము, దుడుకు చేష్టలు చూసి, మొదట్లో చాలా భయపడ్డాను. ఆ తరువాత అదేం చిత్రమో అవన్నీ ఎగిరిపోయాయి ఇప్పుడు దాని పరిస్థితి ఏమిటంటే. దానికి నేనుతప్ప యింకెవ్వరూ అక్కర్లేదు. ఎప్పుడన్నా మిమ్మల్ని తలుచుకుంటుంది, అంతే" సత్యం గర్వపడ్డాడు.

బైట నించి రైలు కూత వినిపించింది.

"పదండి" అన్నాడు మూర్తి లేస్తూ.

ఇద్దరూ ప్లాట్‌ఫారం మీదికి వొచ్చారు. సత్యం గబ గబ అడుగులు వేయడం చూసి మూర్తి ఆపి "ఎందుకంత తొందర?" అన్నాడు మూర్తి. సత్యం అతని వంక ఆశ్చర్యంగా చూశాడు. మూర్తి నెమ్మదిగా "అది రాలేదు సత్యం గారు" అన్నాడు.

సత్యం తెల్లబోయి "ఎందుకని" అన్నాడు.

"అనుకోకుండా దాని స్నేహితురాలి పెళ్ళి వచ్చింది. ఉండి పోయింది".

సత్యం ఉత్సాహమంతా నీరుగారిపోయింది. మూర్తి అతని భుజం తట్టి "దిగులుపడకండి. మరో వారం పదిరోజుల్లో యిద్దరం మీ యింటికి వొస్తాం. నాలుగైదు రోజులుఉంటాం. సరేనా!" అన్నాడు.

సత్యం తలఎత్తి, మూర్తి భుజాల మీదుగా రైలువంక చూశాడు. అక్కడికి పది గజాల దూరంలో ఉన్న రెండవ తరగతి పెట్టెలో, అవతల సీట్లో కూచుని వున్న యువతిమీద దృష్టి పడటంతో, దిగ్భ్రాంతితో కొయ్యబారి పోయాడు. ఆమె సత్యవతి! సందేహంలేదు! కాని...కాని...

సత్యానికి సర్వమూ అర్థంకావటానికి క్షణంలో సగంకన్నా ఎక్కువకాలం పట్టలేదు. జీవితంలో మరొకసారి తాను అవహసించిన సూత్రాల, రీతుల అఖండ విజయం అతన్ని...

అతన్ని కృంగదీయలేదు. నిరాశోపహతుడ్ని చేయలేదు. ప్రేమానురాగాల స్థానంలో, పట్టుదల, కసీ పేరుకోసాగాయి.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అన్నాడు మూర్తి.

"ఏమీ లేదు ... మీ ట్రైను బయలుదేరు తోంది. సత్యవతితో అడిగానని చెప్పండి! ... అన్నగా కాదు. స్నేహితుడిగా" అనేసి వడి వడిగా కదిలిపోయాడు సత్యం.

★

